సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 28 । మార్చి । 2024



'రామయ్య'కు రూ.74.79 లక్షలు
భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 8లో



లక్ష్యానికి చేరువలో...
ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఫీజుల వసూళ్లు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీ బాలాజీ ఆలయంలో సుదర్శన హోమం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థప్రసాదగోష్టి, బలిహరణం, ఊంజల్‌సేవ, దీపోత్సవం తదితర పూజా కార్యక్రమాలను గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా జరిపించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు వనమా వెంకటేష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఈ-సేవా కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లా కోర్టుల్లో ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ బుధవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాదే పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో కొత్తగూడెం నుంచి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ హాజరయ్యారు.

యువకులను కాపాడిన కానిస్టేబుళ్లకు రివార్డు



కానిస్టేబుళ్లకు రివార్డు అందజేస్తున్న మణుగూరు డీఎస్పీ, సీఐ

మణుగూరు టౌన్: హోలీ పండుగ సందర్భంగా మండలంలోని కొండాయిగూడెం గోదావరిలో నీట మునిగిన ముగ్గురు యువకులను కాపాడిన కానిస్టేబుళ్లను బుధవారం తన కార్యాలయంలో డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ధైర్యసాహసాలు ప్రదర్శించి గోదావరిలో దూకి కాపాడిన కానిస్టేబుళ్లు వినయ్, సనైకు క్యాష్ రివార్డు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్ ఉన్నారు.

పూర్‌పాలికలు

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయి రూ.కోట్లలో పేరుకుపోయింది. మరో మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, పన్ను వసూళ్ల లక్ష్యం చేరే పరిస్థితి కనిపించడంలేదు. ఆ ప్రభావం సిబ్బంది వేతనాల చెల్లింపు, అభివృద్ధి పనులపై చూపే అవకాశం ఉంది. – కొత్తగూడెంఅర్బన్

నాలుగు మున్సిపాలిటీల్లో భారీగా బకాయి

- మందకొడిగా ఆస్తిపన్ను వసూళ్లు
- వడ్డీ రాయితీ ఇచ్చినా వెనుకబాటే
- సిబ్బంది కొరత, అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం



పురపాలికలకు ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబాటు కనిపిస్తోంది. ఈనెల 31వ తేదీ వరకు 100 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉండగా.. లక్ష్యం చేరే అవకాశం కనిపించడం లేదు. మున్సిపాలిటీల్లో వసూలైన ఆస్తి పన్ను నుంచే సిబ్బందికి ఏడాది కాలం పాటు వేతనాలు చెల్లించడంతో పాటు అధికారులు ఇతర అభివృద్ధి పనులకు వినియోగిస్తారు. అయితే గతేడాది బకాయిలే ఎక్కువగా ఉండడం, దానికి తోడు ఈ ఏడాది టార్గెట్, పాత బకాయిలకు వడ్డీ.. ఇలా వసూళ్ల లక్ష్యం పెరిగింది. గతేడాది పన్నులకు 90 శాతం వడ్డీ రాయితీ అవకాశం కల్పించినా వసూళ్లు అంతంతమాత్రంగానే జరిగాయి.

'గూడెం'లోనే అధికం..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి రూ.17.08 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు చేయాల్సిఉంది. కానీ ఇప్పటివరకు రూ.10.03 కోట్లు మాత్రమే వసూళ్ల చేశారు. ఇంకా రూ. 7.05 కోట్లు వసూళ్ల కావాల్సి ఉంది. ఇక నాలుగింటిలో కొత్తగూడెంలోనే అత్యధిక బకాయిలు ఉన్నాయి. ఈ పట్టణంలో ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ. 4.20 కోట్లు ఉండగా, గతేడాది పెండింగ్ బకాయిలు రూ.2.22 కోట్లు, దానికి వడ్డీ రూ.1.52 కోట్లు ఉన్నాయి. మిగతా మున్సిపాలిటీల్లోనూ గతేడాది బకాయిలు పేరుకుపోవడంతో భారం ఎక్కువైంది. ప్రస్తుత సంవత్సర పన్నులతో పాటు పెండింగ్ బకాయిలన్నీ కలిపి ఈనెల 31వ తేదీ నాటికి వసూలు చేయాలి. మరి లక్ష్యం ఏ మేరకు పూర్తి చేస్తారో వేచిచూడాలి.

సిబ్బంది కొరత వల్లేనా..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రధానంగా ఆస్తి పన్నుల వసూళ్లు బిల్ కలెక్టర్లే చేస్తారు. వారికి ఆర్‌ఐ, మున్సిపల్ మేనేజర్లు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుంటారు. అయితే నాలుగు మున్సిపాలిటీల్లోనూ ఆయా వార్డులకు తగినంత మంది బిల్ కలెక్టర్లు లేకపోవడం వల్లే పన్నుల వసూళ్లలో జాప్యం నెలకొంటోంది. ఆయా పట్టణాల్లో అవగాహన ఉన్న వారు మాత్రమే స్వచ్ఛందంగా ఇంటి, నీటి పన్నులు కడుతుంటారు. అవగాహన లేని వారు, తెలిసినా చెల్లింపుల్లో మొండికేసే వారి వద్దకు మున్సిపల్ సిబ్బందిని పంపించి వసూళ్లు చేయించాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల కొరత కారణంగానే వసూళ్లలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది.

మున్సిపాలిటీల్లో బకాయిలు ఇలా.. (రూ.కోట్లలో)

మున్సిపాలిటీ	లక్ష్యం	వసూలైనవి
కొత్తగూడెం	8	4
పాల్వంచ	5.12	4
ఇల్లెందు	2.08	1.28
మణుగూరు	1.88	0.75
మొత్తం	17.08	10.03

ప్రభుత్వ బకాయిలే ఎక్కువ..

జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బిల్లులే ఎక్కువగా పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఇందులో రైల్వే, టెలీ కమ్యూనికేషన్ శాఖల నుంచే ఎక్కువ బకాయిలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇంటి పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తూ గత నెలలో మున్సిపల్ అధికారులు ప్రకటనలు చేశారు. కానీ ఈ విషయమై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో సిబ్బంది కాస్త వెనక్కు తగ్గి పన్నులు చెల్లించే వారి దగ్గరే వసూళ్లు చేస్తున్నారు.



కొత్తగూడెంలో ఇంటిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గతేడాది బకాయిలే..



కొత్తగూడెం మున్సిపాలిటీలో గతేడాది బకాయిలు ఎక్కువ మొత్తంలో వసూళ్ల కావాల్సి ఉంది. అందుకే పెండింగ్ ఆస్తి పన్ను అధికంగా కనిపిస్తోంది. అయినా ఆస్తి పన్ను పూర్తిగా వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

–శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

టాప్‌లో ఉండాలి

- ఇక్కడి నుంచి ఉత్తమ డాక్టర్లు రావాలి
- సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హాస్టల్‌కు శ్రీకారం
- వచ్చే నెల ఫెస్ట్, పేరెంట్స్ మీటింగ్
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వెర్బల్ అబ్యూజ్, క్యాంటీన్‌లో భోజనం బాగుండటం లేదంటూ ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థులు లేవనెత్తిన అంశాలపై విచారణ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో కాలేజీలో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గాలపై డాక్టర్ ఆర్‌ఎల్ లక్ష్మణ్‌రావు 'సాక్షి'తో మాట్లాడారు. కాలేజీలో నెలకొన్న వివాదం టీ కప్పులో తుఫాను లాంటిదని ఆయన అన్నారు. ఇక్కడి విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా టాప్‌లో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రిన్సిపాల్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

బస్సుల కోసం ప్రతిపాదనలు పంపాం

కొత్తగూడెం కాలేజీకి సంబంధించి హాస్టల్ , క్లాసు రూములు, ఆస్పత్రి వేర్వేరు చోట్ల ఉన్నాయి. విద్యార్థులు వ్యక్తిగత వాహనాలు, ఆటోల్లో వచ్చిపోవడం కష్టంగా ఉంది. మొదటి ఏడాది ట్రాన్స్‌పోర్టు విషయంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. హాస్టల్ నుంచి కళాశాలకు ఆటోల్లో రావడం ప్రమాదభరితంగా ఉండటంతో అద్దె ప్రతిపాదికన బస్సులు నడిస్తున్నాం. కాలేజీకి బస్సులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉస్మానియా, గాంధీ, రిమ్స్(ఆదిలాబాద్), మహబూబ్‌నగర్ కళాశాలలకే ప్రభుత్వం బస్సులు కేటాయించింది. మిగిలిన చోట్ల విద్యార్థులు ట్రావెల్ చార్జీలు సొంతంగా చెల్లిస్తున్నారు.

లైబ్రరీకి బస్సులు..

కళాశాలలోని లైబ్రరీలో నాలుగు వందల పుస్తకాలు, ముప్పై కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు లైబ్రరీని విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు. లైబ్రరీ ఉపయోగించుకునేందుకు ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపిస్తే లైబ్రరీ టైమ్‌కి అనుగుణంగా కాలేజీ నుంచి గర్ల్స్ హాస్టల్ వరకు బస్సులు ఏర్పాటు చేస్తాం.

ఏప్రిల్‌లో ఫెస్ట్

కాలేజీ ఫెస్టివల్ వాయిదా వేశామనేది నిజం కాదు.



ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు

2024 ఏప్రిల్ 5 నుంచి 8వరకు ఫెస్ట్ నిర్వహిస్తున్నాం. విద్యార్థులు తరగతులు నష్టపోకుండా ప్రభుత్వ సెలవులు కలిసి వచ్చే విధంగా ఫెస్ట్ తేదీలను ఖరారు చేశాం. ఏప్రిల్ రెండో వారంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయించాం. గతంలో ఆన్‌లైన్‌లో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశాం. ఈసారి ప్రత్యక్షంగా ప్రతీ పేరెంట్‌తో మాట్లాడే విధంగా సమావేశాన్ని నిర్వహిస్తాం. ప్రభుత్వ కళాశాల కావడంతో వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన వారు ఇక్కడ చదువుతున్నారు. వీరందరినీ మెడిసిన్‌లో టాప్‌కు చేర్చడమే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఈ కళాశాలను రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలపడమే మా అధ్యాపక బృందం లక్ష్యం.

ఆ వివాదం టీ కప్పులో తుఫాను

మెడికల్ కాలేజీలో ఇటీవల నెలకొన్న వివాదం టీ కప్పులో తుఫాను వంటిది. విద్యార్థులకు ఇబ్బంది రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

పది రోజుల్లో పరిష్కారం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి ఏడాది 149, రెండో ఏడాదికి 150 కలిపి మొత్తం 299 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాలేజీకి అవసరమైన తరగతి గదులు, హాస్టల్, మెస్ తదితర భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఒక్కో విద్యార్థికి నెలకు రూ.3,600 వంతున మెస్ ఫీజుగా నిర్ణయించి కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించాం. అయితే విద్యార్థులు భోజనం నాణ్యతగా లేదని చెప్పారు. దీంతో సెల్ఫ్ మేనేజ్‌మెంట్ విధానంలో మెస్ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాం. ఈ మేరకు విద్యార్థులతో వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఏప్రిల్ పదికల్లా తిరిగి బాయ్స్, గర్ల్స్‌తో పాటు లంచ్ అవర్‌లో కాలేజీలో మెస్ సౌకర్యం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

మాస్టర్ ప్లాన్‌పై మళ్లీ సర్వే

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న మాస్టర్‌ప్లాన్‌పై బుధవారం ఇంజనీరింగ్ అధికారులు మళ్లీ సర్వే చేపట్టారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో గతంలో సర్వే చేశారు. తాజాగా దేవాదాయ శాఖకు చెందిన ఆర్కిటెక్ట్ బృందం, భద్రాచలం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సర్వే చేపట్టారు. మాడ వీధుల విస్తరణ, ఆలయం చుట్టూ ఇతర అభివృద్ధి పనులకు సుమారు 50 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా, దేవాదాయ శాఖ అధికారులకు అందచేయనున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఈ సర్వేలో ఆలయ ఈఈ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

పెద్దమ్మగుడి పాలకవర్గంలో స్థానానికి పోటాపోటీ

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం తర్వాత అంత రద్దీ, ఆదాయం కలిగిన పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) దేవస్థానం పాలకవర్గంలో స్థానానికి పలువురు పోటీ పడుతున్నారు. గత పాలకవర్గం గడువు ఈ నెల 24న ముగియగా, నూతన పాలకవర్గం ఎన్నిక కోసం దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు పాల్వంచ, కొత్తగూడెం పరిధిలోని 52 మంది దరఖాస్తు చేసుకున్నట్లు దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సులోచన తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువగా అధికార కాంగ్రెస్ నాయకులే ఉండగా.. తమ గాడ్‌ఫాదర్ల ద్వారా పాలకవర్గంలో స్థానం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాకే పెద్దమ్మతల్లి గుడి కమిటీని వెల్లడించేందుకు అవకాశముందని సమాచారం.



పెద్దమ్మతల్లి ఆలయం

ప్రతీ ఇంటికి నీరు అందేలా చర్యలు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవిలో నీటి ఎద్దడి రాకుండా జిల్లాలో ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఈఈలు, డీఈలు, పబ్లిక్‌హెల్త్ డీఈలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, స్పెషల్ ఆఫీసర్లతో బుధవారం తాగునీరు, పనుల పురోగతిపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి, తాగునీరు అందించాలని సూచించారు. గ్రామాల్లో చేతిపంపులు, పంపులు, మోటార్లు, పైపులైన్లకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు నీటి సరఫరా ప్రాంతాలను రోజూ విధిగా తనిఖీ చేయాలన్నారు. అవసరం ఉన్నచోట బోర్‌వెల్స్ అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని చెప్పారు. బల్క్‌సప్లై సరిపోని పక్షంలో నీటి సరఫరా పెంచాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఎస్‌డీఎఫ్‌లో ప్రతిపాదించిన పనులను పురోగతిలో ఉన్నవి, పూర్తయినవి, పూర్తి కావాల్సినవి పట్టిక ద్వారా నమోదు చేసి నివేదికలు అందజేయాలన్నారు. అన్ని మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, పొరపాట్లు లేకుండా ముందుగానే తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రంథాలయానికి ఎయిర్‌కూలర్ వితరణ



ఎయిర్ కూలర్‌తో గ్రంథాలయ నిర్వాహకులు, పాఠకులు

కొత్తగూడెంఅర్బన్: ఆర్యవైశ్య మహాసభ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు దారా నగేష్, ప్రధాన కార్యదర్శి జూలూరు ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థకు ఎయిర్ కూలర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు, గ్రంథాలయ సిబ్బందికి వేసవిలో సౌకర్యంగా ఉండేందుకు వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నరేంద్రుల ఋషికుమార్, మేడ గణేష్, కొయ్యాడ నగేష్, కొదుమూరి సురేష్, గ్రంథపాలకులు వరలక్ష్మీదేవి, మణిమృదుల తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల(బ్యాక్‌లాగ్) భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా వెబ్‌సైట్‌లో సీట్ల వివరాలు సరిచూసుకుని రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 21న పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు.

ప్రతిపాదనలు అందజేయాలి

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సామగ్రి పంపిణీ, రూట్ మ్యాప్, అధికారుల, సిబ్బంది విధుల కేటాయింపు తదితర ప్రతిపాదనలను త్వరగా అందజేయాలని పినపాక నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, వాష్ రూమ్, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపునకు రూట్ మ్యాప్‌ను తయారు చేసుకోవాలని ఆదేశించారు. పోలీసు అధికారుల సహకారంతో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన పెండింగ్ ఫారాలు క్లియర్ చేయాలని చెప్పారు. సౌకర్యాలు లేని చోట గిరిజన ఆశ్రమ, జీపీఎస్, గురుకుల పాఠశాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన సెక్టోరియల్ అధికారులకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఎలక్షన్ డీటీ నాగరాజును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు, పినపాక నియోజకవర్గంలోని తహసీల్దార్లు, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

రూ.12 వేల కోట్లతో ఖమ్మం అభివృద్ధి

- యువతకు ఉపాధి కల్పించడమే మా అజెండా
- అయోధ్య నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్
- బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఖమ్మం జిల్లా అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.12 వేల కోట్లు వెచ్చించింది. ప్రధాని మోడీ నాయకత్వంలో ఖమ్మం చుట్టూ జాతీయ రహదారులు నిర్మాణమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా నాకు అవకాశం ఇస్తే జిల్లా అభివృద్ధిలో మరింత ముందుకెళ్తుంది' అని బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వందల కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమైనందున.. స్థానికుడిని, ఇక్కడి సమస్యలు తెలిసిన తనకు ప్రజలు అవకాశం ఇవ్వాలని కోరారు. ఖమ్మంలో కాంగ్రెస్, టీడీపీ, బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇచ్చిన ఓటర్లు ఈసారి తనను గెలిపిస్తే అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని తెలిపారు. మేధావులు, విద్యావంతులు, అనుభవజ్ఞులతో చర్చించి లోక్‌సభ పరిధిలోని సమస్యలపై విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని యువతకు ఉపాధి కల్పించడమే తమ అజెండాలో ముఖ్యమైన అంశమని, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కలను సాకారం చేయడంతో పాటు అయోధ్య నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ మంజూరు చేయిస్తానని వినోద్‌రావు తెలిపారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, పార్టీ కోసం ప్రాణాలర్పించిన సాయిగణేష్ కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ వినోద్‌రావుకు బీజేపీ టికెట్ ఇవ్వడంతో కాంగ్రెస్‌కు అభ్యర్థి కరువయ్యారని.. ఈ స్థానంలో తమ అభ్యర్థిపూర్తి మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్‌డీఏలో భాగమైనందున వారి మద్దతు సైతం తమకు ఉంటుందని తెలిపారు. అనంతరం ఖమ్మంరూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు శ్యాం రాథోడ్, అల్లిక అంజయ్య, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, చావా కిరణ్, ఉపేందర్, విజయరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభ్యర్థి వినోద్‌రావు, పక్కన నాయకులు

క్లుప్తంగా

రామయ్య హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు



బ్యాంకు అధికారులకు నగదు అందచేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 26 రోజులకు గాను రూ.74,79,341 ఆదాయం సమకూరిందని ఈఓ రమాదేవి తెలిపారు. ఇందులో హుండీల ద్వారా రూ.71,22,878, గోశాలకు రూ.1,95,363, అన్నదానానికి విరాళంగా రూ.1,61,100 వచ్చినట్లు వెల్లడించారు. కాగా, హుండీల్లో విదేశీ కరెన్సీ కూడా లభించిందని తెలిపారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ముగిసిన ఎంపిక పోటీలు



ఎంపిక పోటీలను పర్యవేక్షిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని రెండు స్పోర్ట్స్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపికకు పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడాపాఠశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్నట్లు పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండో రోజు పోటీలకు 46 మంది హాజరుకాగా, ఇందులో 31మంది బాలికలు, 15మంది బాలురున్నారు. ఈ పోటీలను జిల్లా క్రీడాధికారి బొల్లి గోపాల్ రావు, పర్యవేక్షించగా, పీడీలు, అధికారులు కొమరం వెంకటనారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, నర్సయ్య, రామారావు, మోతీలాల్, కృష్ణ, డి.శిరోమణి, హతీరాం, రవి, ముత్తయ్య, రాంబాబు, నాగరాజు, పార్వతి, మయూరి, బాబూరావు, జె.కృష్ణవేణి, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

భద్రాచలంటౌన్: పట్టణంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సాయిశ్రీ సాత్విక్ జాతీయస్థాయిలో నిర్వహించిన మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పరీక్షల్లో మొదటి ర్యాంక్ సాధించిన సందర్భంగా బుధవారం పాఠశాల యాజమాన్యం సత్కరించింది. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు 154 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 40 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యున్నతమైన ర్యాంకులు సాధించారు. అందులో సాయిశ్రీ సాత్విక్ మొదటి స్థానంలో నిలిచాడని కరస్పాండెంట్ కె.అబ్రహం పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం రాధామంజరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

భద్రాచలం నుంచి విశాఖకు బస్సులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజూ విశాఖపట్నానికి లహరి నాన్ ఏసీ బస్సులతో పాటు ఖమ్మంకు త్రీ స్టాప్ డీలక్స్ సర్వీసులను గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.రామారావు తెలిపారు. ఖమ్మంకు త్రీస్టాప్ బస్సులు ప్రతిరోజు ఉదయం 6, 7, 9.30, 10.30, మధ్యాహ్నం 1.30, 2.30, సాయంత్రం 5, 6 గంటలకు బయలు దేరుతాయని చెప్పారు. ఇక విశాఖపట్నానికి లహరి బస్సులు ఉదయం, రాత్రి 9 గంటలకు, విశాఖపట్నం నుంచి ఉదయం 8, రాత్రి 8.45 గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

టేకులపల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదారవూఫ్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ బజారులోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. రేషన్ బియ్యాన్ని గుర్తించి, లెక్కించగా 440 కేజీలు ఉన్నట్లు తేలింది. వాటి విలువ రూ.8,800 ఉంటుందని ఎస్‌ఐ చెప్పారు. ఈ బియ్యం బస్టాండ్ సెంటర్‌కు చెందిన ఏఎస్ భూషణ్‌కి చెందినవిగా విచారణలో తేలిందని, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జీపీ సీతానగరంలోని ఎస్సీకాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొప్పుల నీలంకు చెందిన ఇల్లు దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి అంటుకున్నాయి. ఇంట్లో వృద్ధ దంపతులు బయటకు పరుగుతీశారు. మంటలు పక్కింటికి అంటుకోకుండా గ్రామస్తులు అదుపుచేశారు. ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

లక్ష్యానికి చేరువలో...

మార్కెట్ ఫీజు వసూళ్లలో ముందంజ

- ఖమ్మం జిల్లాలో 96.76 శాతం, భద్రాద్రిలో 84.10 శాతం వసూళ్లు
- సీసీఐ, సివిల్ సప్లయీస్ నుంచి రూ.కోట్లలో బకాయిలు
- అవి కూడా రెండు, మూడు రోజుల్లో జమ అయ్యే అవకాశం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన ఫీజుల వసూళ్ల లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. వ్యవసాయ మార్కెట్ల పరిధిలో పంటల ఉత్పత్తిని పరిగణనలోకి మార్కెటింగ్ శాఖ లక్ష్యాలను నిర్దేశించింది. ఇందులో ఖమ్మం జిల్లా 93.76 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 84.10 శాతం మేర వసూలు చేయగా... కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), సివిల్ సప్లయీస్ సంస్థలు కొనుగోలు చేసిన పత్తి, ధాన్యం పంటలకు సంబంధించి ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉంది. రూ.కోట్లలో ఉన్న ఈ బకాయిలు కూడా వసూలైతే మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యం పూర్తికానుంది.

కొనుగోళ్లపై పన్నులు.. ఒక శాతం ఫీజు

ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లను ఏర్పాటు చేసింది. రెండు జిల్లాల్లో ప్రధాన పంటగా వరితో పాటు వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి కూడా రైతులు సాగు చేస్తున్నారు. ఇక మొక్కజొన్న కూడా యాసంగిలో విస్తారంగా సాగవుతుంది. వీటికి తోడు అపరాల పంటలైన పెసర, కంది, మినుములే కాక ఉద్యాన పంటలైన మామిడి, బొప్పాయి, నిమ్మ, జామ వంటి పంటలను కూడా ఇక్కడ సాగు చేస్తారు. రైతుల నుంచి పంట ఉత్పత్తులను మార్కెట్లు, గ్రామాల్లో కొనుగోలు చేసే వ్యాపారులు వివిధ రకాల పన్నులతో పాటు ఒక శాతం మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంస్థల ద్వారా కొనుగోలు చేసినా మార్కెట్ ఫీజును చెల్లించేలా నిబంధనలు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం కొంత మేర తగ్గినా మార్కెట్ ఫీజు లక్ష్యాలను చేరుకుంటోంది.

జిల్లాల వారీగా ఇలా...

- ఖమ్మం జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యం రూ.5,439.72 లక్షలుగా నిర్దేశించగా.. ఇప్పటివరకు రూ.5,100.18 లక్షలు(96.76శాతం) వసూలు చేశారు. ఖమ్మం మార్కెట్ లక్ష్యం అధికంగా ఉండగా 87.09 శాతం వసూలైంది. ఇక కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్లు లక్ష్యాన్ని మించి ఫీజు వసూలు చేశాయి. మద్దులపల్లి మార్కెట్ మాత్రం బాగా వెనకబడింది. గత ఏడాది ఎనిమిది మార్కెట్ల ఫీజు లక్ష్యం రూ.5,436 లక్షలు కాగా రూ.5,722.76 లక్షలు(105.28శాతం) వసూలైన నేపథ్యాన ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈసారి కూడా లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు చెబుతున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఫీజు లక్ష్యం రూ.1,920.35 లక్షలు కాగా, రూ.1,614.94 లక్షలు వసూలు చేశాయి. ఈ జిల్లాలో బూర్గంపాడు మార్కెట్ ఫీజు లక్ష్యం అధికంగా ఉండగా.. 94.87 శాతం వసూలైంది. దమ్మపేట మార్కెట్ లక్ష్యాన్ని మించి 131.89 శాతంతో జిల్లాలో అగ్రబాగాన నిలిచింది. కొత్తగూడెం, చర్ల మార్కెట్లు మాత్రం లక్ష్యసాధనలో వెనకబడ్డాయి.

ఆ బకాయిలు కూడా వస్తే...

ఈ ఏడాది పత్తికి బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర లభించకపోవటంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ద్వారా కొనుగోలు చేశారు. ఇక రెండు జిల్లాల్లో వరి ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోళ్లు చేపట్టారు. దీంతో ఈ రెండు శాఖలు కొనుగోల చేసిన పంటలకు వ్యవసాయ మార్కెట్లకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని మార్కెట్ల పరిధిలో సీసీఐ రూ.3.05 కోట్లు, భద్రాద్రి జిల్లా పరిధిలో రూ.51.06 లక్షలు, పౌర సరఫరాల శాఖ ఖమ్మం జిల్లాలో రూ.8 కోట్లు, భద్రాద్రి జిల్లాలో దాదాపు రూ.3.50 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు కూడా రెండు, మూడు రోజుల్లో కొంత మేరకైనా వ్యవసాయ మార్కెట్లకు జమ అయ్యే అవకాశమున్నందున లక్ష్యాన్ని చేరుకునే అవకాశముంది.

మార్కెట్ల వారీగా ఫీజు లక్ష్యం, వసూలైన మొత్తం (రూ.లక్షల్లో)

మార్కెట్	లక్ష్యం	వసూలు	శాతం
దమ్మపేట	218.00	287.53	131.89
బూర్గంపాడు	532.00	504.69	94.87
ఇల్లెందు	455.00	361.59	79.47
భద్రాచలం	166.00	130.26	78.47
నూగూరు చర్ల	253.35	152.89	60.35
కొత్తగూడెం	296.00	177.98	60.13
మొత్తం	1,920.35	1,614.94	84.10

"లక్ష్యాలను చేరుకుంటాం..



మార్కెటింగ్ శాఖ ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన మేరకు మార్కెట్ ఫీజు వసూలు చేస్తాం. రెండు జిల్లాల్లో మూడు వ్యవసాయ మార్కెట్లు వెనకబడ్డాయి. దీంతో ఆయా మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. సీసీఐ, సివిల్ సప్లయీస్ నుంచి బకాయిలు వస్తే లక్ష్యాలను చేరుకుంటాం. ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నాం. – ఎం.ఏ.అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

సింగరేణి నియామకాల బాధ్యత ఈడీసీఐఎల్‌కు..



ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పా)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఉద్యోగాల భర్తీ (ఎక్స్‌టర్నల్)కి నోటిఫికేషన్ జారీ చేయగా.. పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ (ఈడీసీఐఎల్)కు అప్పగిస్తూ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయించామని డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈడీసీఈఐఎల్ ద్వారా పరీక్షలు నిర్వహించనుండగా, మూడంచెల్లో అభ్యర్థుల తనిఖీ, నమోదు ఉంటుందని తెలిపారు. తద్వారా ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశముండదని పేర్కొన్నారు. గతంలో ఈ సంస్థ కేంద్ర, రాష్ట్రాల పరిధిలోని వివిధ ఉద్యోగ నియామక పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. కాగా, సంస్థ విడుదల చేసిన నోటిఫికేషన్లు సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉన్నట్లు కొందరు తమ దృష్టికి తీసుకొచ్చినందున పరిశీలిస్తామని డైరెక్టర్ చెప్పారు.

లక్ష్య సాధన దిశగా..

సింగరేణి సంస్థ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోందని డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు కంపెనీ నిర్దేశించిన 68.90 మిలియన్ టన్నుల లక్ష్యంలో 68.85 లక్షల టన్నుల ఉత్పత్తి (96 శాతం) నమోదు కాగా, ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కార్మికుల సమష్టి కృషితో మిగతా లక్ష్యాన్ని చేరుకుంటామనే నమ్మకముందని చెప్పారు. ఇప్పటికే కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, బెల్లంపల్లి, ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో 100 శాతం ఉత్పత్తి సాధించగా, మిగిలిన ఏరియాలపై దృష్టి సారించామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఆర్థిక సంవత్సరం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ఉద్యోగులు, కార్మికులు కృషి చేయాలని డైరెక్టర్ కోరారు.

ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చంద్రుగొండ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో వెలుతురు, తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లపై ఆరా తీశారు. అన్ని రకాల సౌకర్యాలు ఉండాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ఓ ప్రైవేట్ ధాన్యం మిల్లును పరిశీలించి లెవీ బియ్యం, ఇంకా స్టాక్ ఉన్న ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్‌ఐ అక్బర్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అబ్బుగూడెం, మర్రిగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ పరిశీలించారు. బుధవారం అబ్బుగూడెంలోని 62, 63, మర్రిగూడెంలోని 74 నంబర్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, అక్కడి సౌకర్యాల గురించి తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింక్ కెనాల్ భూసేకరణపై అధికారుల భేటీ



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ కాశయ్య

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు నీటిని ఏన్కూరు మండలంలోని సాగర్ కాల్వలోకి, ఆపై వైరా రిజర్వాయర్‌లోకి మళ్లించేందుకు లింకు కెనాల్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందు కోసం భూమి సేకరించాల్సి ఉండగా.. జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినోభానగర్, జూలూరుపాడు గ్రామాల రైతులతో పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) కాశయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నీటిని ఏన్కూరు మండలంలోని సాగర్ కెనాల్‌కు అనుసంధానం చేసేలా కాల్వ నిర్మించనుండగా, 50 ఎకరాల భూమి ప్రభుత్వం సేకరించాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు సర్వేను అడ్డుకోవడానికి కారణాలపై ఆరా తీసిన ఆయన రైతులు సహకరించాలని కోరారు. అయితే, విలువైన వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తుండటమే కాక బోర్లు కూడా ఉన్నాయని రైతులు చెప్పారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం తక్కువగా ఉన్నందున ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలని కోరడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌డీసీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, గిర్దావర్ తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.12.84 లక్షల నగదు స్వాధీనం

- ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తూ పట్టుబడిన పలువురు
- ఎన్నికల చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన అధికారులు



సుజాతనగర్ : నగదు తరలిస్తున్న వ్యక్తితో పోలీసులు

సుజాతనగర్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసిన అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా పలువురు వ్యక్తులు తీసుకెళ్తున్న రూ.12 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. జూలూరుపాడు మండలానికి చెందిన కడియాల శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సుజాతనగర్‌లో పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.9.50 లక్షల నగదు తీసుకెళ్తున్నట్లు తేలడంతో స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లవద్దని, ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదు తరలిస్తే స్వాధీనం చేసుకుంటామని ఎస్‌ఐ జుబేదాబేగం తెలిపారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో రూ.2,14,500

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలం పెనగడప సరిహద్దు చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.2,14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు. చంద్రుగొండ నుంచి కొత్తగూడెంనకు కారులో వస్తున్న వ్యక్తుల వద్ద ఈ నగదు లభించిందని, ఎలాటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు వెల్లడించారు.

అశ్వారావుపేటలో రూ.1.20 లక్షలు

అశ్వారావుపేటరూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన వాహనాల తనిఖీల్లో బుధవారం నగదు లభ్యమైంది. అశ్వారావుపేటలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో నిర్వహించిన ఈ తనిఖీల్లో అశ్వారావుపేట మండలం తిరుమలకుంటకు చెందిన నాగబాబు వద్ద కారులో రూ.1.20 లక్షలు ఉండగా సీజ్ చేసినట్లు అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

రైతుల నుంచి రూ.4.30 లక్షలు స్వాధీనం

మిర్చి అమ్మి వస్తుండగా చెక్‌పోస్టులో సీజ్



నగదుతో రైతులు, పక్కన స్క్వాడ్ అధికారులు

ఇల్లెందు: ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను ఖమ్మం మార్కెట్‌లో అమ్మి వస్తున్న రైతుల నుంచి రూ.4.30 లక్షల నగదును ఎన్నికల చెక్‌పోస్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు కల్తీ సత్యనారాయణ, మంగయ్య బుధవారం ఖమ్మంలో మిర్చి అమ్మి రూ.4.30 లక్షలతో స్వగ్రామానికి బొలేరో వాహనంలో బయలుదేరారు. ఈ సందర్భంగా ఇల్లెందు మండలం రొంపేడులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారులు కుమారస్వామి, అబ్దుల్ ఘనీ వీరి నుంచి డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేల కంటే నగదు తీసుకెళ్లొద్దని తెలిపారు. అయితే, తాము పంట అమ్మిన డబ్బు తీసుకెళ్తున్నామని రైతులు చెప్పినా ససేమిరా అన్న అధికారులు.. తగిన ఆధారాలను కలెక్టరేట్‌లో సమర్పించి నగదు తీసుకోవాలని సూచించారు.

మద్యం మత్తులో యువకుల హల్‌చల్

- గప్‌చిప్‌లు తిని డబ్బులు అడిగితే దాడి
- పోలీసులను సైతం లెక్కచేయని వైనం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన యువకులు



వాహనాలను అడ్డుకుంటున్న యువకులు

చంద్రుగొండ: మద్యం మత్తులో ఐదుగురు యువకులు స్థానిక ప్రధానసెంటర్‌లో బుధవారం సాయంత్రం హల్‌చల్ చేశారు. గప్‌చిప్ తిని డబ్బులు అడిగిన వ్యాపారిపై ఆ యువకులు దాడికి దిగారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలానికి చెందిన ఐదుగురు యువకులు పెనగడప గ్రామంలో ఓ శుభకార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో చంద్రుగొండలోని ప్రధాన సెంటర్‌లో ఆగి గప్‌చిప్ తిన్నారు. తిని వెళ్లిపోతుండటంతో వ్యాపారి డబ్బులు ఇవ్వమని అడగటంతో దాడికి దిగారు. అక్కడే ఉన్న ఓ మహిళపై దాడి చేశారు. గమనించిన చుట్టుపక్కల వ్యాపారులు అడ్డుకోబోగా వాళ్లపై వీరంగం చేశారు. అడ్డువచ్చిన వారిపై దాడి చేస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులను సైతం లెక్కచేయకుండా రహదారిపై వచ్చే వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులపై కూడా ఆ యువకులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో బలవంతంగా ఆ యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానికులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులకు ఎస్‌ఐ మాచినేని రవి సర్ది చెప్పి పంపించారు.

ఐదుగురిపై కేసు

చంద్రుగొండలోని ప్రధాన సెంటర్‌లో మద్యం మత్తులో పలువురిపై దాడికి దిగిన ఐదుగురు యువకులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు. జూలూరుపాడుకు చెందిన గోలి రాజా, ఇస్రం చింటు, పెంట్లకు చెందిన కుక్కముడి నరేంద్ర, కుక్కముడి అనిల్, ఏన్కూర్‌కు చెందిన మోదుగు శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోడు భూముల్లో కందకాలు తవ్వే యత్నం

రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం

గుండాల: పోడు భూములకు హక్కు పత్రాలు వచ్చినప్పటికీ ఫారెస్టు అధికారుల దాడులు ఎక్కువయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోడు భూముల్లో కందకాలు తొవ్వేందుకు వచ్చి ఫారెస్ట్ అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కాచనపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులకు ఇటీవలే పోడు భూముల పట్టాలు వచ్చాయి. వారు సాగు చేస్తున్న భూములు పూర్తిగా అడవిలో ఉన్నాయని, నూతనంగా పోడు నరికారని అధికారులు అంటున్నారు. కాగా, ఏడుగురికి హక్కుపత్రాలు ఉన్నాయని రైతులు మొరపెట్టుకున్నా ఆ పత్రాలు చెల్లవంటూ సర్వే చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాము ఏళ్లనుంచి పోడు సాగు చేస్తున్నామని, గిరిజన రైతులు అంటున్నారు. అనేక సార్లు పాలకులతో మొరపెట్టుకుంటే హక్కుపత్రాలు వచ్చాయని, ఇప్పుడు అధికారులు ఆక్రమించుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే, సమాచారం లేకుండానే, పట్టాలు చూపించినా ఆ పట్టాలు చెల్లవని, ట్రంచ్ కోసం లైన్ తీస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాచనపల్లి రైతులు నూతనంగా అడవిని నరికారని, గుట్టపై సాగు చేస్తున్నారని కొమరారం రేంజర్ ఉదయ్ అన్నారు. హక్కుపత్రాలు ఉన్న భూముల జోలికి తాము వెళ్లడం లేదని తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామలపై పోలీసు లు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన గమిడి రమ్యతో భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న శివకృష్ణకు ఐదేళ్ల కిందట వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. కొంతకాలంగా భర్త అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని బుధవారం రమ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్తతోపాటు అత్త లక్ష్మి, మామ అప్పారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని 21 పిట్ ఏరియా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మస్సివాగు గ్రామానికి చెందిన హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ఇల్లెందు నుంచి బైక్‌పై స్వగ్రామమైన మస్సివాగుకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఓసీ-2 కార్మికుడు మృతి

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియా ఓసీ–2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న కాటుమండి సాంబమూర్తి(57) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. మణుగూరు నుంచి పీ.వీ.కాలనీ సూపర్‌బజార్‌లోని నివాసం వైపు బుధవారం రాత్రి ఆయన వెళ్తుండగా, మోటార్ సైకిల్ అదుపుతప్పి సమితిసింగారంలో కింద పడ్డాడు. ఈ ఘటనలో సాంబమూర్తి తలకు తీవ్ర గాయం కాగా వంద పడకల ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా.. సింగరేణి కార్మికులు, అధికారులు సంతాపం ప్రకటించారు.